# తగినంత యూరియా
# సరఫరా చేయాలి

- ❑ కేంద్ర మంత్రి జెపి నడ్డాకు విజ్ఞప్తి చేసిన మంత్రి తుమ్మల
- ❑ రాష్ట్రానికి కేటాయించిన విధంగా యూరియాను సప్లై చేయాలి
- ❑ ఎప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి ఇంకనూ రావాల్సి ఉన్న 2.10 లక్షల మెట్రిక్ టన్నులను కూడా ఆగస్టు మాసంలో సరఫరా చేయాలి
- ❑ కేంద్రమంత్రి జెపి నడ్డా లేఖకు ప్రతిస్పందనగా మంత్రి తుమ్మల లేఖ



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థలైన నుండి 11,000 మెట్రిక్ టన్నులు నుండి 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా గారిని తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పిన వల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను ద్వారా భర్తీ చేయాలని మరియు ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని, దాంతో పాటు ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరియా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## కేసీఆర్, హరీష్‌రావుల బండారం
## బట్టబయలైంది: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నివేదికతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల బండారం బట్టబయలైందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడిషియల్ కమిషన్ విచారణలో బయటపడిందని తెలిపారు. అందుకే తేలు కుట్టిన దొంగలా.. హరీష్ రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ విమర్శించారు. హరీష్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయని స్పష్టం చేశారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణలో కేసీఆర్ పాత్ర ఏమిటో.. హరీష్ రావు చేసిన ఘనకార్యాలేమిటో తేలిపోయిందన్నారు. కాళేశ్వరం నివేదికపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే హరీష్ రావు ఏకంగా జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని విమర్శించారు. విచారణ కమిషన్ తేల్చిన విషయాలపైనా, ఇచ్చిన నివేదికపైన అసెంబ్లీలో చర్చిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నమ్మకం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. అందుకే.. కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్షన్ అంటూ ఎద్దేవా చేశారు. హరీష్ రావు అసెంబ్లీకి వచ్చి, చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ డిమాండ్ చేశారు.




నవభూమి
హైదరాబాద్
06 ఆగస్టు,2025 బుధవారం | పేజీలు:8
www.epaper.navabhoomi.in


## అసెంబ్లీలో రేవంత్ ప్రభుత్వాన్ని ఆధారాలతో సహా కడిగేస్తాం

### ❑ హరీష్‌రావు స్ట్రాంగ్ వార్నింగ్



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** కాళేశ్వరం కమిషన్ నివేదికపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై పూర్తి ఆధారాలతో హరీష్‌రావు బ్రీఫింగ్ చేశారు. హరీష్‌రావు ప్రెజెంటేషన్ చూసేలా బీఆర్ఎస్ నేతలు జిల్లాల్లో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక పూర్తిగా ట్రాష్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి బాధ్యతను మాత్రమే కేసీఆర్ నిర్వర్తించారని... రాజకీయ జోక్యం ఎలా అవుతోందని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్‌ను హింసించాలనే ధోరణి తప్పా.. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజా సమస్యలు పట్టడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు దేశంలో చాలా కమిషన్లు న్యాయస్థానాల ముందు నిలబడలేదని చెప్పుకొచ్చారు. గతంలో చంద్రబాబుపై కూడా కమిషన్లు వేశారని.. అవి నిలబడలేదని గుర్తుచేశారు. సర్ ఆర్థర్ కాటన్ మాదిరిగా.. కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని ఉద్ఘాటించారు. తెలంగాణలో కమీషన్ల ప్రభుత్వం నడుస్తోందని ఆక్షేపించారు. 650పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. కాళేశ్వరం నివేదికలో నచ్చిన పేరాలను లీక్ చేశారని... నచ్చని నాయకులను బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు మాజీ మంత్రి హరీష్‌రావు పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కేంద్రాన్ని తప్పుపట్టినట్లుందని విమర్శించారు. కాళేశ్వరానికి అనుమతులు ఇచ్చిందే కేంద్ర ప్రభుత్వమని గుర్తుచేశారు. కాళేశ్వరం పూర్తి రిపోర్ట్ బయటకు వచ్చాక కాంగ్రెస్ సంగతి చూస్తామని వార్నింగ్ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి హడావుడి చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక కుట్రతో జరిగిన వ్యవహారమని ఆరోపించారు. పోలవరం మూడుసార్లు కూలినా ఎన్డీఎస్ఏ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మేడిగడ్డకు మాత్రం ఎన్డీఎస్ఏ మూడు సార్లు వచ్చిందని ఫైర్ అయ్యారు. ఇది కాంగ్రెస్, బీజేపీ కుటిల రాజకీయమని మండిపడ్డారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ డిజైన్ చేసిన కాంగ్రెస్‌పైనే మెదట చర్యలు తీసుకోవాలని కోరారు మాజీ మంత్రి హరీష్‌రావు. కాళేశ్వానికి కేంద్రం ఇచ్చిన అనుమతులు చూపిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆధారాలతో సహా కడిగేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే.. మైక్ కట్ చేసి పారిపోకూడదని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయడం కోసం ముఖ్యమంత్రి రివ్యూ చేయకుండా ఎలా ఉంటారని.. కేసీఆర్ కూడా అదే చేశారని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని కూడా కేసీఆర్ సొంత నిర్ణయంగా రేవంత్ ప్రభుత్వం ఎలా చెబుతోందని నిలదీశారు. సీడబ్ల్యూసీ అనుమతి, కేబినెట్ నిర్ణయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సంస్థ కూడా మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ కట్టవచ్చని చెప్పిందని మాజీ మంత్రి హరీష్‌రావు గుర్తుచేశారు.

## నాకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదు

### ❑ వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):** భాష విషయంలో నాయకుల తీరు మారాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఇవాళ(మంగళవారం) సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్య మంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్య మంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు.

## జయనగర్‌లో డ్రైనేజీ సమస్యపై ఎర్రబెల్లి ఆగ్రహం

### జీహెచ్ఎంసీ అధికారులు తాత్కాలిక మరమ్మతులకే పరిమితమైపోతున్నారు





**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5:** 124వ డివిజన్ పరిధిలోని ఉష ముల్లపూడి ప్రధాన రహదారి గోవింద్ హోటల్ చౌరస్తా నుంచి జయనగర్ కాలనీ లోపలికి డ్రైనేజీ నీరు పొంగిపడి రోడ్లమీద ప్రవహిస్తోంది. దీంతో కాలనీ వాసులు, ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య తీవ్రత తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ఎర్రబెల్లి సతీష్‌రావు మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు తాత్కాలిక మరమ్మతులకే పరిమితమైపోతున్నారని, కొద్ది రోజులకే మళ్లీ నీరు పొంగిపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాములు గౌడ్, కళ్యాణ్, చేజర్ల రాములు, సాయి గౌడ్, అరుణ్ రెడ్డి, జయనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు

## వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

### టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్

**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5 :** వినియోగదారులు సంతృప్తి చెందే విధంగా వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని, ఆవిధంగా సేవలందిస్తే ఏ వ్యాపారమైనా అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట్ ఆంజనేయ నగర్‌లోని శ్రీమదుర్గ భవన్‌లో ఈనాడు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 11వ శాఖను మంగళవారం ఆయన, బ్యాంకు చైర్మన్ జెట్టి గోపీచంద్‌ల సమక్షంలో ప్రారంభించారు. రమేష్ దీప ప్రజ్వలన చేసి, నిర్వాహకులను అభినందించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నిర్ణీత గడువులోనే సేవలు అందించాలని సూచించారు. బ్యాంకు కార్యకలాపాలు శాఖోపశాఖలుగా విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ కె. తులసి ప్రసాద్, మేనేజర్ ఇన్. చక్రవర్తి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.





# పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం

- రేషన్ కార్డుల ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు సగటున రూ. 1,200 విలువైన ఉచిత బియ్యాన్ని అందిస్తుంది
- ఐటీ, పరిశ్రమలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని వైఏఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పాలన సాగుతోందని, అందులో భాగంగా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు జారీ చేయాలనే లక్ష్యంతో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో నెలకు రూ. 61 కోట్ల 15 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పేదలకు అందించాలనే ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 12 వేల కొత్త రేషన్ కార్డుల జారీతో సగటున 50 వేల మందికి సన్నరకం బియ్యం అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. గతంలో మా ప్రభుత్వం కృష్ణా నీటిని తీసుకొచ్చి హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య లేకుండా చేసిందని, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతానికి కొత్త పరిశ్రమలను తీసుకువస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 65 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు రేషన్ కార్డులు అందించడం నిరంతర ప్రక్రియ అని, ఇంకా అర్హులైన వారిని కూడా త్వరలో గుర్తించి కార్డులు ఇస్తామని, వడ్డీ లేని రుణాల పథకంతో మహిళలకు కోట్ల రూపాయలు కేటాయించి, వారికి వ్యాపార నైపుణ్యాలలో శిక్షణ అందించి ఇందిర మహిళా శక్తి ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మహేశ్వరం, బాలాపూర్ మండలాల వారికి మంత్రి రేషన్ కార్డులు పంపిణీ చేసి, లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, కందుకూరు ఆర్డీవోరాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.





# కూకట్‌పల్లిలో కుండపోత

# నగర వీధులు వరద మయం

- తులసీనగర్‌లో వరద నీటిలో కొట్టుకు పోయిన రెండు బైక్‌లు

**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి ఆగస్టు 4 :** నగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, జేఎన్‌టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, వివేకానందనగర్, మూసాపేట్, బాలానగర్ పరిసర ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. గత ఐదు రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కపోతకు అలమటిస్తున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించినప్పటికీ, భారీ వర్షం కారణంగా వీధులు, రహదారులు నీట మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండు గంటలుగా కురుస్తున్న వర్షం వల్ల రోడ్లు చెరువుల్లా మారాయి. వర్షపు నీటిలో కొట్టుకువచ్చిన రెండు మోటార్‌సైకిళ్లు కూకట్ పల్లి అల్విన్ కాలనీ తులసీనగర్ ప్రాంతంలో వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. కాగా అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సాయంత్రం స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాలు ముగిసే సమయం కావడంతో వాహనాలు రోడ్లపై భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా తులసీ వనం, తులసీనగర్, నిజాంపేట్ రోడ్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తులసీ వనం ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పలు చర్యలు చేపట్టారు. మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.









## సాంస్కృత సారధి కళాబృందం కళా ప్రదర్శన





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** మహేశ్వరం నియోజకవర్గంలోని మల్లాపూర్ వై ఎ ఆర్ కన్వెన్షన్ లో, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రిఅయినటువంటి శ్రీధర్ బాబు సమక్షంలో మంగళవారం నాడు రాష్ట్ర సాంస్కృత సారధి ఇంచార్జ్ అనేమల్ల అనిల్ కుమార్ బృందంకళా ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆలోచించింది

## వెంకటయ్య కుటుంబానికి రూ.60 వేల సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** అనారోగ్యంతో ఆసుపత్రిపాలై చికిత్స పొందిన వెంకటయ్య కుటుంబానికి రూ.60 వేల సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం చెక్కును తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అందించారు. బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామానికి చెందిన కొత్తూరు చిన్న వెంకటయ్య ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి తో నగరంలోని మమత ఆస్పత్రి లో చేరారు. ఇలా చికిత్స పొందిన నేపథ్యంలో అందుకు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం గా రూ.60 వేలు విడుదలవ్వగా సంబంధిత చెక్కును మహేందర్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తమ బాధ్యతని చెప్పారు. సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, నితిన్ రెడ్డి తదితరులు ఆయనతో ఉన్నారు

## శక్తి పంపులు: ఎఫ్వై 26కి శుభారంభం, ఎగుమతుల్లో ఊపు

SHAKTI
PUMPING LIFE

**హైదరాబాద్, ఆగస్టు 5(నవభూమి):** శక్తి పంపులు (ఇండియా) లిమిటెడ్ జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి గాను బలమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. కంపెనీ ఛైర్మన్ దినేష్ పాటి దార్ వ్యాఖ్యానించారు, సౌర పంపుల విభాగంలో అమలు, ఎగుమతుల వృద్ధి, సామర్థ్య, సాంకేతిక పెట్టుబడుల వల్ల ఈ పురోగతి సాధ్యమైందన్నారు.పి.ఎం. కుసుమ్ పథకంలో సుమారు 25 శాతం మార్కెట్ వాటాతో కంపెనీ కీలక పాత్ర పోషిస్తోంది. ఆగస్టు 1 నాటికి రూ.1,350 కోట్ల ఆర్డర్ బుక్ను కలిగి ఉండగా, పలు రాష్ట్రాల నుంచి స్థిరమైన డిమాండ్ ఉందని సంస్థ తెలిపింది. పీ.ఎం. సూర్యఘర్ యోజన వంటి ప్రభుత్వ ప్రోత్సాహంతో రూఫ్టాప్ సోలార్ విభాగం వేగంగా పెరుగుతోంది. గత నాలుగేళ్లుగా ఎగుమతులు సగటున 25 శాతం వృద్ధి చూపించాయని, హైతీ, బంగ్లాదేశ్, ఉగాండా వంటి దేశాల్లో విజయవంతమైన ప్రాజెక్టులు, అమెరికా, మిడిల్ ఈస్ట్ నుంచి డిమాండ్ పెరుగుతున్నట్లు సంస్థ పేర్కొంది.వర్కింగ్ క్యాపిటల్ సైకిల్ను మెరుగుపరచినట్లు తెలిపిన కంపెనీ, ప్రస్తుతం అమలవుతున్న రూ.1,700 కోట్ల క్యాపెక్స్ ప్రణాళికతో మోటార్లు, సోలార్ ప్లాంట్, ఈవీ మోటార్-చార్జర్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. క్యూ.ఐ.పీ ద్వారా రూ.292.6 కోట్లు సేకరించినా, మిగిలిన నిధులను అంతర్గత వనరులు, అప్పుల ద్వారా సమకూర్చనుంది.ఎఫ్.వై 26లో 25-30 శాతం ఆదాయ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని, దీర్ఘకాలికంగా క్లీన్ ఎనర్జీపై దృష్టితో సంస్థ ముందుకు సాగుతోంది

# బీసీలకు చట్టసభల్లో సరైన వాటా కల్పించాలి ఎంపీ వద్దిరాజు డిమాండ్



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** దేశ జనాభాలో 60%పైగా ఉన్న బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా రాజ్యాధికారంలో బీసీలకు సరైన వాటా లభించకపోవడం, చాలా కులాల వాళ్ళు చట్టసభల్లోకి కాలు కూడా పెట్టకపోవడం బాధాకరమన్నారు. బీసీలపై ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా వివక్ష కొనసాగుతుండడం విచారకరమని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా , ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని,ప్రతి వార్షిక బడ్జెట్ లో 20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ ఆర్భాటంగా ప్రకటించి అధికారంలోకి వచ్చాక మాయమాటలతో కాలం వెళ్లదీస్తున్నదని కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టారు.కామారెడ్డి డిక్లరేషన్ లో, ఎన్నికల మేనిఫెస్టోలో,ప్రచార సభల్లో చేసిన వాగ్దానం మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందేనని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్రానికి పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందామని చూస్తున్నదని, కేంద్రంలోని బీజేపీ పాలకులు ఇది తెలంగాణకు సంబంధించిన అంశంగా చూస్తూ ఏ మాత్రం స్పందించడం లేదన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్,అన్ని వర్గాల ప్రజలు వత్తిడి పెంచడంతో తెలంగాణ పాలకులు, కాంగ్రెస్ నాయకత్వం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుని హడాహుడి చేస్తున్నదని, ధర్నాలు, ప్రెస్ మీట్స్ వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ప్రధాని నరేంద్రమోదీని ఒప్పించేందుకు సోనియా, రాహుల్ గాంధీల నేతృత్వంలో అఖిలపక్షాన్ని తీసుకెళ్లడమే ఉత్తమ మార్గమని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.ప్రధాని మోడీ కూడా ఓబీసీకి చెందిన వారేనని,ఆయనపై మరింత వత్తిడి పెంచి ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టించేందుకు ఇదే సరైన సమయమన్నారు.కాంగ్రెస్,దాని నేతృత్వంలోని ఇండియా కూటమికి లోకసభ, రాజ్యసభ ల్లో 300 మందికిపైగా సభ్యులున్నారని,బీసీ బిల్లుకు సునాయాసంగా ఆమోదం లభిస్తుందని, ఇందుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ రవిచంద్ర వివరించారు.బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ మార్గదర్శనంలో బీసీలం రాజకీయ అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో, చట్టసభల్లో రిజర్వేషన్స్ సాధించే వరకు పోరాడుతూనే ఉంటామని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవకతవకలు

- ప్రజలకు కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్
- టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం




**కూకట్ పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 4:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక వెలువడిన నేపథ్యంలో, నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ప్రాజెక్టులో విస్తృత అవకతవకలు జరిగినట్లు కమిషన్ తేల్చిందన్నారు..మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణాలు పూర్తిగా అప్పటి సీఎం నిర్ణయాలే అని, కుటుంబ ప్రయోజనాల కోసం ప్రాజెక్టును గూడుపుఠాణిగా మలిచారని ఆరోపించారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయం గల ప్రాజెక్టును రూ.1,10,248 కోట్లకు పెంచి, కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో రూ.87,449.15 కోట్ల రుణభారం మోపారని విమర్శించారు. తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని ప్రజలను నమ్మించి, గుంటనక్కలా వేలకోట్లు దోచుకున్నారు అని దుయ్యబట్టారు. కాళేశ్వరం నిర్మాణంలో నిర్లక్ష్యం, నియంతృత్వ ధోరణి, ప్రజా ధన దుర్వినియోగం స్పష్టమైందని, దీనికి పూర్తి బాధ్యత అప్పటి సీఎం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేపు అసెంబ్లీలో హాజరై, ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పట్టుబట్టింది.

**ప్రజలను అప్పుల్లో ముంచిన పాలన:** పది సంవత్సరాల పాలనలో ఎన్నో కుంభకోణాలు జరిగినా, బీజేపీతో లోపాయికారి ఒప్పందం కారణంగా సీబీఐ, ఈడీ విచారణలు జరగలేదని డా.సత్యం విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, ఖజానాను ఖాళీ చేసిన పాలన ప్రజలకు చేదు అనుభవం మిగిల్చిందని అన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. ముస్లింలను సాకుగా చూపి బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపడుతున్నామని తెలిపారు.

# ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్‌లో రాహుల్‌కు గోల్డ్‌మెడల్

- వైభవంగా మహీంద్రా యూనివర్సిటీ స్నాతకోత్సవం
- విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చేలా పలువురి విశిష్ట అతిథుల సూచనలు






**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 4:** బహదూర్ పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో నాలుగో వార్షిక స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ విభాగాలకు చెందిన 950మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21మందికి గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేశారు. ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్‌లో 9.82 సీజీపీఏ సాధించి గోల్డ్ మెడల్ అందుకున్న సోదాదశి రాహుల్ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, పట్టుదలతో తన విభాగంలోనే అగ్రస్థానం దక్కించుకున్న రాహుల్, చదువుతో పాటు పరిశోధనా ప్రాజెక్టుల్లోనూ చురుకైన పాత్ర పోషించాడు. తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలిచిన రాహుల్ విజయంపై వేదికపై హర్షధ్వానాలు మిన్నంటాయి..ఈ ఏడాది ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఎంఏ, బీటెక్ నానోటెక్నాలజీ కోర్సులకు కూడా తొలి స్నాతకోత్సవం కావడం విశేషం. 13 మంది పీహెచ్‌డీ స్కాలర్లు డిగ్రీలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవానికి మహీంద్రా గ్రూప్ ఛైర్మన్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా అధ్యక్షత వహించగా, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా, టెక్ మహీంద్రా సీఈఓ అండ్ ఎండీ మోహిత్ జోషి గౌరవ అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చేలా పలువురు విశిష్ట అతిథులు సూచనలు అందించారు. తన కృషి పట్టుదలతో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్‌లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న రాహుల్ విశ్వవిద్యాయానికి గర్వకారణంగా నిలిచాడు. తన విజయానికి కుటుంబం, అధ్యాపకుల ప్రోత్సాహమే కారణమని రాహుల్ ఈ సందర్భంగా పేర్కొన్నాడు.

# ప్రజాయుద్ధనౌక గద్దర్ 2వ వర్ధంతి నేడు



అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5 : ప్రజాయుద్ధ నౌక కవి రచయిత తాత్వికవేత్త గద్దర్ రెండవ వర్ధంతి నేడు హైదరాబాదు రవీంద్ర భారతిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం వరకు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్నారు. 6 ఆగస్టు 2023 న ఆయన మృతి చెందిన సంగతి అందరికీ తెలిసిందే . మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు కళాకారుల కోసం సమయం కేటాయించారు. 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహచర మంత్రివర్యులు హాజరవుతారు ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొని గద్దర్ కు ఘనమైన నివాళి అర్పించారు . సమావేశంలో గజ్జల అభిమానులు, కవులు కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జివి సూర్యకిరణ్ కోరారు.

# తాగునీటి సమస్యపై సత్వర చర్యలు చేపట్టాలి

## అధికారులను ఆదేశించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద





కుత్బుల్లాపూర్ – ఆగస్టు 5:(, నవభూమి ప్రతినిధి) సూరారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలవాసులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కలిసి మంజీరా నీటి సరఫరా, త్రాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు విస్తరిస్తున్న నగరానికి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచి నీరు అందించేలా, త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. అనంతరం జలమండలి అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గతంలో మాదిరిగా నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, డివిజన్ యూత్ అధ్యక్షులు దొడ్ల శ్రీనివాస్, సంక్షేమ సంఘాల సభ్యులు కె. శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, దారం శివ గుప్తా, యాదయ్య గౌడ్, బషీర్, సురేష్ బాబు, సురేష్, చంద్రశేఖర్, అమృత, లత, లక్ష్మీ, రమేష్, మహేష్, సత్తి, సదానందం, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వర్షంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

■ ప్రజల సమస్యలు తెలుసుకున్న బండి రమేష్







కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 4: సోమవారం కురిసిన భారీ వర్షంతో కూకట్ పల్లి నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఫతేనగర్ డివిజన్‌లోని దీన్ దయాల్ నగర్ కాలనీలో పలు ఇళ్లలో నీరు చేరి, ఫర్నీచర్, బట్టలు, బియ్యం తదితర గృహోపకరణాలు పాడయ్యాయి. రాత్రి నివసించడానికి కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం కాలనీలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వాసులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్తీ వాసుల సమక్షంలో జిహెచ్ఎంసి కమిషనర్‌కు ఫోన్ చేసి, నీటిమునిగే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. బస్తీ పక్కనే ఉన్న బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండటం వల్ల ప్రతి చిన్న వర్షానికీ కాలనీ జలమయమవుతోందని, బ్రిడ్జిని ఎత్తు పెంచి, రిటర్నింగ్ వాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. హైడ్రా విభాగం అధికారులతో కూడా ఈ విషయమై చర్చించారు. వర్షపునష్టాల కారణంగా ఇబ్బందులు పడుతున్న దీన్ దయాల్ నగర్ వాసులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ విజయభాస్కర్ రెడ్డి, కార్యదర్శి హరిప్రసాద్ నాయుడు, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కుక్కల రమేష్, లక్ష్మయ్య, శివ చౌదరి, గొట్టిముక్కల వెంకటేష్,. పిడికిటి గోపాల్, బాకీ శ్రీనివాస్ యాదవ్, సాయిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# కూకట్‌పల్లిలో వర్ష ప్రతాపం పలు ప్రాంతాలు జలమయం

■ స్థానిక నాయకులతో కలిసి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన బండి రమేష్

■ వరద బాధితులకు అండగా ప్రభుత్వం

కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5: సోమవారం కురిసిన భారీ వర్షం కూకట్ పల్లి నియోజకవర్గంలో ఫతేనగర్ డివిజన్‌లోని అమృత్‌నగర్, తండా, దీన్‌దయాల్‌నగర్, ప్రభాకర్‌రెడ్డి నగర్ తదితర ప్రాంతాలు మునిగిపోయాయి. ముఖ్యంగా అమృత్‌నగర్ తండా పూర్తిగా జలమయమై, వందలాది కుటుంబాలు ఇళ్లను వదిలి రోడ్డుపైకి రావాల్సి వచ్చింది. నీట మునిగిన ఇళ్లలోని ఆహార పదార్థాలు, అవసరమైన వస్తువులు పనికిరాకుండా పోవడంతో బాధితులు రాత్రి భోజనం కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. తాత్కాలికంగా కట్టుబట్టలతో బతుకుతెరువు కోసం వచ్చిన బస్తీవాసులు ఇప్పటికే హౌసింగ్ బోర్డు 15వ ఫేజ్ వద్ద ఉన్న ఇందిరమ్మ గృహాలలో తలదాచుకున్నారు. మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు బాధితుల కోసం కెపిహెచ్బీ కాలనీ నాలుగో ఫేజ్ ఫంక్షన్ హాల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పరిస్థితులు కుదుటపడే వరకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, కుక్కల రమేష్, బాకీ, శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.









## వాటర్ ట్యాంకర్ ఢీకొని టూ వీలర్ నడిపే వ్యక్తి దుర్మరణం



**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** నగర శివారులోని ప్రగతి నగర్ ఎలీప్ సర్కిల్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ఒక వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో, టూ వీలర్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం, మధ్యాహ్నం సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్యాంకర్ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలపై పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా, ఇలాంటి విషాద ఘటనలు జరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

## కమిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన ఏనుగు సుదర్శన్ రెడ్డి



**మేడ్చల్ - ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** ఘట్కేసర్ ఉమ్మడి మండల పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగుడ రేణుకబిఎల్లమ్మ కాలనిలో రోడ్డు కబ్జా గురి చేసారని  స్థానికులు ఇబ్బంది పడుతున్నారని స్థానిక బిజెపి నాయకుల సమాచారంతో కాలని ప్రజలతో కలిసి సమస్య ఉన్న రోడ్డు వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకోవడం జరిగింది, అనంతరం ఆ స్థలానికి సంబంధించిన యజమానితో సద్దుమణిగేలా మాట్లిడి అదే స్థలంలో కమిటీ హాల్ కట్టిస్తనని కాలని ప్రజలకు చవైఎస్సార్ హామి ఇచ్చారు యజమాని సత్యనారాయణతో కలిసి భూమి పూజలో భాగంగా కొబ్బరి కాయ కోట్టి శంఖుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండలం బిజెపి నాయకులు బాలు యాదవ్, జగదీష్ గౌడ్ వెంకట్,  కాలని అధ్యక్షురాలు మంగ  , స్థానిక కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాంత్రినగర్ సోషల్ వేల్ఫేర్ అసోసియేషన్‌కు సహకారం : కాంగ్రెస్ నాయకులు కొలను హనుమంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్న సందర్భంగా ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను హన్మంతన్న శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని, కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, కాలనీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు గంజి కోటేశ్వర్ రావు, రాఘవేంద్ర రెడ్డి, రాజాసుర, కృష్ణ చైతన్య, శ్రీధర్, వంశీ, హరిబాబు, బుగ్గారెడ్డి, నరసింహ, కమిటీ కోఆర్డినేటర్ శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు

## ఎంపీ కొడుకునని, న్యూరోసర్జన్‌నని చెబుతూ ఘరానా మోసాలు

- ఘరానా మోసగాడిని అరెస్టు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు
- 14 కేసుల్లో నిందితుడు



**కూకట్ పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5:** తాను తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యుడి కుమారుడు డా. విక్రాంత్ రెడ్డినని, అపోలో ఆస్పత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్నానని, జూబ్లీహిల్స్‌లో నగల దుకాణం ఉందని నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్న ఘరానా మోసగాడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని వాయిల వెంకటేశ్వర్లు అలియాస్ డా. విక్రాంత్ రెడ్డి అలియాస్ విక్కీ (29)గా గుర్తించారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేఎన్‌టీయూ బస్ స్టాప్ సమీపంలో ఉన్న సితారా ఉమెన్స్ పీజీ హాస్టల్ నిర్వహిస్తున్న మహిళ ఫిర్యాదు మేరకు ఈ అరెస్టు జరిగింది. ఆగస్టు 5, 2025న ఉదయం 11:30 గంటలకు జేఎన్‌టీయూ హెచ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిందితుడిని పట్టుకుని, మధ్యాహ్నం 2 గంటలకు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ వివరాలను బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్ కుమార్ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదిదారురాలు తన హాస్టల్‌లో నివాసం ఉంటుంది. నిందితుడు డా. విక్రాంత్ రెడ్డి తన సోదరుడిని హాస్టల్‌లో చేర్చడానికి వచ్చాడు. ఆ తరువాత తన జూనియర్లను చేర్చడానికి, హాస్టల్ ఆహారాన్ని రుచి చూడటానికి అని నాలుగుసార్లు హాస్టల్‌ను సందర్శించాడు. దీంతో ఫిర్యాదిదారురాలికి అతడితో పరిచయం ఏర్పడింది. ఒకరోజు తన వద్ద జూబ్లీహిల్స్‌లో నగల దుకాణం ఉందని చెప్పి, ఆమె బంగారు గొలుసును రీమోడలింగ్ చేయమని నమ్మించాడు. అతడిని నమ్మి ఆమె తన నాలుగు తులాల బంగారు గొలుసును అతడికి అప్పగించింది. గొలుసు రీమోడలింగ్ కోసం మరింత బంగారం అవసరమని చెప్పి, ఆమె నుండి ఆన్‌లైన్‌లో రూ. 55,000, నగదు రూపంలో రూ. 45,000 తీసుకున్నాడు. ఆ తర్వాత అతని ఫోన్ నంబర్లు పని చేయకపోవడంతో ఆమె మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై గతంలో కేపీహెచ్‌బీ, కావలి రూరల్, సంతపేట, కావలి ఐ టౌన్, అల్లూరు, కాకినాడ పోర్ట్, పెదకాకాని, కోవూరు, జూబ్లీహిల్స్, గోపాల్‌పురం పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 14 కేసులు నమోదయ్యాయి. ఈ కేసును ఛేదించడంలో బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్ కుమార్, కూకట్ పల్లి డివిజన్ ఏసీపీ ఇ.రవి కిరణ్ రెడ్డి, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ ఎస్.రాజశేఖర్ రెడ్డి, కేపీహెచ్‌బీ డబ్ల్యూఎస్ఐ ఎం.శ్రీలత, ఇతర సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన సిబ్బందికి రివార్డులు అందజేసి ప్రోత్సహిస్తామని అధికారులు తెలిపారు.

## అపర భగీరథునికి అవినీతి మరక అంటించాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు  ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షణ కార్యక్రమం ఏర్పాటు. నగరంలోని బిఆర్ఎస్ భవన్  వేదికగా కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేసేందుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గారు చేసిన కృషిని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలంగాణ ప్రజానీకానికి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు వివరించగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ లోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి గారు హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో అడుగడుగునా నిర్లక్ష్యానికి గురై పాలకుల అసమర్ధ పాలనతో, తెలంగాణపై ఉన్న వివక్షతతో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక బీడుబారిన తెలంగాణ ప్రాంతాన్ని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు, తెలంగాణ దార్శనికులు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గారిని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో తన బృహత్తర ప్రణాళికలతో కాలేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో రైతన్న కళ్ళల్లో ఆనందం నింపి, నాడు దండగగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పండుగగా మార్చిన గొప్ప నేత కెసిఆర్ గారు.

కాలేశ్వరం వంటి భారీ ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసి దేశంలోనే అత్యధిక దిగుబడి నిచ్చే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కెసిఆర్ గారిపై అవినీతి మరక అంటించేందుకు ఈ స్కాంగ్రెస్ ప్రభుత్వం కుటిలయత్నాలు చేస్తుందని, దీనిని ప్రజలంతా గమనిస్తున్నారని, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రగతిని కుంటుపరచిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నేడు పెద్దలు హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో నాడు కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకత, ఇంత భారీ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి కలిగిన లబ్ధిని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలేశ్వరం పేరుతో చేస్తున్న అసంబద్ధ ఆరోపణలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీయే రక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# గిరిజన సరస్వతి పుత్రికకు ఆర్థిక సాయం




**కుత్బుల్లాపూర్ – ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఐటి ర్యాంక్ సాధించిన పేదింటి సరస్వతీ పుత్రిక .పానుగోతు ధనలక్ష్మి కి దాత జి స్వప్న అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్ శాఖ వారి సహకారంతో ? 15,000/- రూలి ఆర్థిక సహాయం అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. రవి నాయక్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా, దామరచెర్ల మం, వీర్లపాలెంలి గ్రామానికి చెందిన పానుగోతు సైదా నాయక్ సునీత రెండో కుమార్తె ధనలక్ష్మి ఈ ఏడాదిలో జేఈఈ మెయిన్స్ లో పుదుచ్చేరి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ సీటులి సాధించింది. తండ్రి సైదా నాయక్ మార్బుల్ పాలిష్ మిల్లులో దినసరి కూలిగా పనిచేస్తూ నలుగురు పిల్లల్ని చదివిస్తున్నాడు. ధనలక్ష్మి అడ్మిషన్ ఫీజు కొరకు ఇబ్బందిలో ఉన్న కుటుంబానికి ఆసరాగా నిలబడి ఆర్థిక సాయం అందజేశాము. ఈ కార్యక్రమంలో భరత్, కరుణాకర్, మహేష్ లు పాల్గొన్నారు.

# 27 కులాల బీసీ అసోసియేషన్‌కి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతు







**కుత్బుల్లాపూర్ – ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** తెలంగాణ 27 క్యాస్ట్ బీసీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ గుత్తుల మీరా కుమార్ గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీ న్మార్ మల్లన్న ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ కి సంబంధించిన కులాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజుల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా జీవో నెంబర్ 3 ని తీసుకువచ్చి 27 కులాలను బీసీ జాబితా నుండి తొలగించిన విధానం మల్లన్న కి వివరించడం జరిగింది సమస్యను పూర్తిగా విన్న మల్లన్న ఈ విషయం పైన తప్పకుండా న్యాయం చేస్తామనిసిఎం కి తెలియజేసి మనందరినీ తిరిగి బీసీలలో చేర్చే విధంగా ప్రయత్నం చేస్తాను. వారు హామీ ఇవ్వడం జరిగింది బీసీల రాజ్యాధికారం దిశగా ప్రయాణం చేస్తున్న మల్లన్న మన 27 కులాలకు తప్పకుండా సపోర్ట్ చేస్తానని అందరం కలిసి బీసీరాజ్యాధికారం.సాధించాలని వారు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో, అధ్యక్షులు గుత్తుల మీరా కుమార్ , వైస్ ప్రెసిడెంట్ జీ లక్ష్మీనారాయణ శ్రీ కేవీ రావు, శ్రీ వాసంశెట్టి రాజబాబు, ప్రధాన కార్యదర్శి, శ్రీ ఎంఎస్ నాయుడు ట్రెజరర్ కృష్ణం నాయుడు వర్కింగ్ ప్రెసిడెంట్, గుబ్బల లక్ష్మీనారాయణ , వైస్ ప్రెసిడెంట్ శ్రీ సాయి కృష్ణ , జాయింట్ సెక్రెటరీ శ్రీ పిల్లి నాగ గోపాలకృష్ణ ఇతర పెద్దలు పాల్గొనడం జరిగింది.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు

## ■ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు హామీ



**మేడ్చల్,- ఆగష్టు 5:( నవభూమి ప్రతినిధి)** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పని సరిగా రేషన్ కార్డుల పంపిణీ చేస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్ మండలంలోని అత్వెల్లి లోని జిఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరిల తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్ధర్బాబుమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాకంగా చేపట్టిన రేషన్ కార్డలు పంపిణీ చేయడం శుభ సూచకమని అన్నారు. ఇదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కార్డులు ఇస్తున్నామని, అలాగే రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని అన్నారు. ప్రస్తుత పేదలు సన్నబియ్యాన్ని బియ్యం తీనాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ కార్డుల పై ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పన సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. గత10 సంవత్సరాలుగా అనేక మంది రేషన్ కార్డులకై ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఇప్పుడా ఆ పరిస్థితులు లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకతీతంగా రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. జిల్లాలో సుమారు 40,082 వేల కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తున్నామని, పాత రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులను చేర్చడం, పేర్లు తొలగించడం వంటి మార్పులతో దాదాపు 82 వేల రేషన్ కార్డులను , మొత్తం 1 లక్ష 22 వేల కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అతి త్వరలో ఇంకో 60 రేషన్ కార్డులను సిద్దం చేసి, పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. 2 లక్షల రేషన్ కార్డులను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు . పంపిణీ చేసిన రేషన్ కార్డుతో పాటు ఆరోగ్య శ్రీ కార్డు కూడా అమలు అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము ఇచ్చిన 6 గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని, ఇందులో భాగంగా ఒక్కొక్కటిగా నిరంతరంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే ఇచ్చిన వాగ్దానంతో అర్హులైన అందరికీ పథకాలు అందిస్తూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ కార్యక్రమాలు చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుస్తూన్నామన్నారు.

అర్హులైన 3 లక్షల 75 వేల మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఇందుకు గాను ఇప్పటి వరకు దాదాపుగా రూ.200 కోట్ల మేరకు ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు.

అలాగే మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచితంగా ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో విద్యను బలోపేతం చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలననే లక్ష్యంతో ప్రతి జిల్లాకు రూ. 200 కోట్లు ఖర్చుచేసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ హాస్టల్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి జలాలను హైదరాబాద్ కు తరలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నార ని తెలిపారు. అర్హులైన ప్రతి నీరుపేదకు ప్రతినియోజకవర్గంలో పారదర్శకంగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం మహిళల ఆర్థిక స్వాలంబనకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని అన్నారు.రైతులకు రైతు భరోసా,రుణమాఫీ చేశామని తెలిపారు. గృహజ్యోతి పథకం, గ్యాస్ పథకం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎక్కడ కూడా రాజీ పడకుండా అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఎవరికైనా రేషన్ కార్డు రాకపోతే తిరిగి అప్లై చేసుకోవాలని చీఫ్ విప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి మాట్లాడుతూ నూతన ఆహార భద్రతా కార్డులు కోసం జిల్లాలో అధిక మొత్తం దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులు కలిగిన ప్రతి ఒక్క లబ్దిదారునికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సుమారు 618 రేషన్ షాపులు ద్వారా దాదాపు 15 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ప్రతి నెల అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నారన్నారు,

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా లబ్దిదారులకు దాదాపు కోటి రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో గంధ్రాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహులు యాదవ్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్‌డిఓ ఉపేందర్ రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస రెడ్డ, శామీర్ పేట్ తహశీల్దార్ యాదగిరి రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.



# కూకట్ పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం

## ■ కరెంట్ షాక్‌తో వ్యక్తి తీవ్ర గాయాలు

**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 5 :** మంగళవారం మధ్యాహ్నం భాగ్యనగర్ కాలనీలో జరిగిన ఘటన స్థానికులను కలచివేసింది. వేణు అనే వ్యక్తి ఏదో పని చేసుకుంటూ ఉండగా అకస్మాత్తుగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా కుదిపేసిన ఆ విద్యుదాఘాతం కారణంగా అతను అక్కడికక్కడే నేలకొరిగాడు. ప్రమాదం గమనించిన స్థానికులు తక్షణమే అతని దగ్గరకు చేరుకొని సీపీఆర్ చేసి, అంబులెన్స్ సహాయంతో సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఏ విధంగా జరిగిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. వేణు ఎక్కడి నుండి కరెంట్ షాక్‌కు గురయ్యాడు, ఎలాంటి పరిస్థితుల్లో ఇది జరిగింది అనే అంశాలను పోలీసులు విచారణ చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న కూకట్ పల్లి పోలీసులు సాక్షుల వాంగ్మూలాలు సేకరించడంతో పాటు మరిన్ని ఆధారాలు కూడా సేకరిస్తున్నారు. స్థానికుల సహాయస్ఫూర్తి వల్ల వేణు ప్రాణాలను రక్షించడానికి



అవకాశం లభించిందని సాక్షులు చెబుతున్నారు.

## నిజాంపేట్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత





**కుత్బుల్లాపూర్ – ఆగష్టు 5:(నవభూమి ప్రతినిధి)** నిజాంపేట్ పరిధిలోని సర్వే నెంబర్ 186లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది కూల్చి వేశారు.కూల్చివేథలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## కుత్బుల్లాపూర్ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ – ఆగష్టు 5( నవభూమి ప్రతినిధి)** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు మహిళా నాయకురాలు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు వినతి పత్రాలు అందజేశారుఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు

## విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు క్యాష్ రివార్డు

**ఖమ్మం క్రైం, నవభూమి, ఆగస్టు 5 :** ఉత్సాహంతో పనిచేసే పోలీస్ సిబ్బందిని మరింత ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఇటీవల జిల్లాలో గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కష్టపడి పనిచేసిన టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎస్ కె. ఖాసీంఅలీ, కానిస్టేబుల్ వి.గోపి, యం.సతీష్ లను పోలీస్ కమిషనర్ అభినందించి, క్యాష్ రివార్డు అందజేశారు.

### ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో

# సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 5:** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా సమావేశమై చర్చించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. మంత్రితోపాటు హాజరైన తెలంగాణ ఎంపీలు,

**హైదరాబాద్–విజయవాడ:** మల్కాపూర్ నుంచి విజయవాడ (అమరావతి) వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలు గా విస్తరించడంతో పాటు సర్వీస్ రోడ్లను నిర్మించాలని గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. డెత్ రోడ్డుగా పిలిచే హైదరాబాద్–విజయవాడ రహదారిపై జూలై 27 న జరిగిన ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీల మృతి చెందిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చిన మంత్రి.. చలించిపోయిన గడ్కరీ. 5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ప్రతీరోజు ప్రమాదాల వార్తలను వినడం, కొన్నిసార్లు ప్రత్యక్షంగా చూడటం బాధ కలిగిస్తుందని తన ఆవేదనను గడ్కరీతో పంచుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ.. ఆగష్టు 15 వ తేదీన నిర్వహించే ఫైనాన్స్ మీటింగ్ లో ఎన్.హెచ్–65 విస్తరణను ఆమోదిస్తామని.. త్వరితగతిన అంచనాలు రూపొందించి పంపాలని, వెంటనే టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చిన గడ్కరీ.

**ఆర్ఆర్ఆర్:** సంగారెడ్డి టూ చౌటుప్పల్:లి రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ పూర్తి చేసిన విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని గడ్కరీని కోరిన మంత్రి 4 వరుసలుగా నిర్మించాలనుకున్న రీజినల్ రింగ్ రోడ్డు ను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 6 వరుసలుగా నిర్మించేందుకు ఎస్టిమేషన్లు మాడిఫై చేస్తున్నామని, టెండర్లను సైతం అందుకు అనుగుణంగా ఫైనలైజ్ చేస్తమని గడ్కరీకి వివరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. రీవైజ్ ఇష్టిమేషన్ తో 3 నెలల్లో ఉత్తర భాగం పనులు మొదలు పెట్టాలని, అంతేకాకుండా ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం కూడా యుద్ధప్రతిపాదికన ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని గడ్కరీని కోరిన మంత్రి. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ఇండస్ట్రీయల్ కారిడార్ గా రూపుదిద్దుకొనున్న నేపథ్యంలో వేగంగా పనులు చేపడితే అనుకున్న వ్యయంలోనే భూసేకరణ పూర్తవుతుందని.. ఆలస్యం జరిగితే భూసేకరణకు ధరలు పెరిగి ప్రాజెక్టుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని సవివరంగా గడ్కరీకి వివరించిన మంత్రి కోమటిరెడ్డి. మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తిపై పాజిటివ్ గా స్పందించిన గడ్కరీ.. అలైన్ మెంట్ ప్రపోజల్స్ పంపితే, అనుకున్నదానికన్న ముందే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని గడ్కరీ హామీ.

**ఎల్ బీ నగర్ – మల్కాపూర్ :**

చింతల్ కుంట చెక్ పోస్ట్ నుంచి హయత్ నగర్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు దాదాపు 5 ½ కిలోమీటర్ల ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్ గా నిర్మించడంతో పాటు నాగ్ పూర్ లో మాదిరిగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ గా నిర్మాణం చేపట్టాలని గడ్కరీని రిక్వెస్ట్ చేసిన మంత్రి.

కోమటిరెడ్డి చేసిన విజ్ఞప్తికి ఓకే తెలిపిన గడ్కరీ. అందుకు సంబంధించిన ప్రపోజల్స్ పంపిస్తే వెంటనే మంజూరీలు ఇస్తానని తెలిపిన గడ్కరీ. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం వియూపీలు నిర్మించడం వలన తీవ్రంగా ఇబ్బందులు పడుతామని ప్రభుత్వానికి స్థానిక ప్రజలు కోరుతున్నందున.. దాన్ని ఎలివేటెడ్ గా మంజూరీ చేయాలన్న మంత్రి కోమటిరెడ్డి రిక్వెస్ట్ కు సానుకూలంగా స్పందించిన గడ్కరీ.

హైదరాబాద్ – శ్రీశైలం రోడ్డ్ జాతీయ రహదారి(ఎన్ హెచ్ –765) :

**హైదరాబాద్ – శ్రీశైలం రహదారి:** లో టైగర్ రిజర్వ్ నుంచి వెళ్తున్న ప్రాంతాన్ని ఎలివేటెడ్ కారిడార్ గా గుర్తించాలన్న మంత్రి కోమటిరెడ్డి విజ్ఞాపనకు.. అలైన్ మెంట్ అప్రూవల్ ఇస్తూ మంజూరీ చేస్తానని హామి ఇచ్చిన మంత్రి గడ్కరీ. ఈ రహదారి ప్రాంతం ప్రస్తుతం 62 కిలోమీటర్లు ఉందని, ఎలివేటెడ్ కారిడార్ గా మార్చితే నాలుగు కిలోమీటర్లు తగ్గి 58 కిలోమీటర్ల అవుతుందని తెలిపిన మంత్రి.

**హైదరాబాద్ – మన్నెగూడ :**

ఈ రహదారికి సంబంధించి.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఉన్న అంశాన్ని త్వరగా పూర్తి చేసి కాంట్రాక్టర్ ను ఒప్పించి త్వరితగతిన పనులు పూర్తిచేయడానికి సహకరించాలని అడిగిన మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి. వేగంగా అన్ని అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీ. ఇవే కాకుండా, సేతు బంధన్ మరియు సిఆర్ఐఎఫ్ (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నుంచి ప్రపోజల్స్ ఫర్ సాంక్షన్ కు మంత్రి కోమటిరెడ్డి రిక్వెస్ట్ చేయగా వచ్చే వారం మీ సెక్రటరీతో ప్రపోజల్స్ పంపించి మంజూరీ చేసుకొవాల్సింది చెప్పిన గడ్కరీ. కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి. తెలంగాణలో జాతీయ రహదారులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నాని.. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఉప్పల్ ఫ్లైఓర్ పనులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నానని, వీటితో రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల అందించేందుకు హ్యామ్ విధానంలో ఇప్పటికే రోడ్లను ఎంపిక చేశామని తెలిపిన మంత్రి. అడిగిన ప్రతీ రహదారి విజ్ఞప్తిని ఎంతో సహృదయంగా స్వీకరించి అన్ని రోడ్లకు మంజూరీలు ఇస్తానని తెలిపిన కేంద్ర మంత్రి గడ్కరీ కి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డ

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**గుండాల ఆగస్టు 5 నవభూమి:** ఆగష్టు 1 నుంచి 9 తారీకు వరకు ఆదివాసులు ప్రపంచం దినోత్సవంను ప్రతి గ్రామంలో జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుగులోత్ రామ్ చందర్ అన్నారు.

షెడ్యూల్ ఐదు, పెసా చట్టం, 1/70, అటవీ హక్కుల చట్టం – 2006 లను పకడ్బందిగా అములుచేయాలని అన్నారు. పెసా సభలు అనుమతి లేకుండా అటవీ భూములును కార్పొరేట్ కంపెనీలకు, టైగర్ జోన్లకు ఫార్మా కంపెనీలకు, ఫీల్డ్ ఫైరింగ్ లకు కేటాయించడానికి ఆపాలని కోరారు. పోడుభూములు సాగు చేస్తున్న ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారుల దాడులును అక్రమ కేసులును తక్షణమే నిలిపివేయాలి. ఆదివాసులకు డబల్ బెదురూములు నిర్మించి ఇవ్వాలి. ఆదివాసీ గూడెలలో ఉచితంగా విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ పౌరులు పై ఆపరేషన్ కాగర్ కాన్సెప్ట్ తో అమాయక గిరిజనులును దారుణంగా ఎన్కౌంటర్ పేరుతో హత్యలు చేస్తుంది, ఇట్టి ఆపరేషన్ ను నిలిపి వేయాలని సిపిఐ ( ఎంఎల్ ) న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం ఖండిస్తుంది. ఇట్టి ప్రకటనలో పాల్గొన్న ఆదివాసులు నాయకులు,




కార్యకర్తలు, సబ్ డివిజన్ నాయకులు గుగులోత్ రాంచందర్, యనగంటి భూషణం, గోగ్గేలా పాపారావు, ఊకె పగడయ్య, ఇస్లావత్ శ్రీను, మాలోత్ కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బలిజవాని కుంట నుంచి రాంజికుంట వరకి చెరువు నీళ్లు వెళ్ళడానికి నాలా పనులు



**కుత్బుల్లాపూర్ - ఆగస్టు 5:(నవభూమి ప్రతినిధి)** దుండిగల్ మండలం బరంపేట గ్రామం సింహపురి కాలనీ ప్రజల పోరాటానికి ఫలితంగా నేడు బలిజవాణికుంట నుంచి రాంజికుంట వరకి చెరువు నీళ్లు వెళ్ళడానికి నాలా పనులు చేస్తున్న ఇరిగేషన్ అధికారులు. అతి త్వరలోనే చెరువు సర్వే చేసి సుందరీకర్ణ పనులు చేయనున్నారు.

## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని ఆహ్వానించిన భౌరంపేట శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయ ఆలయకమిటీ సభ్యులు



**కుత్బుల్లాపూర్ - ఆగస్టు 5:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం పరిధిలో దుండిగల్ మున్సిపాలిటీలోని భౌరంపేట శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో ఈ నెల 8 నుండి 11 వరకు జరిగే వార్షికోత్సవాలలోమాజీ ఎమ్మెల్యే, కూన శ్రీశైలం గౌడ్ గారిని ముఖ్యతిధిగా పాల్గొనాలని ఆలయకమిటీ సభ్యులు ఆహ్వానపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానపత్రాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, సురేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, సత్తిరెడ్డి, విజయ్ గౌడ్, చంద్ర శేఖర్ రెడ్డి, గోపాల్, నాగభూషణం గార్లతో పాటు పాల్గొన్నారు

## కేపీహెచ్‌బీలో పేకాట పేకాట రాయుళ్లపై దాడి

### పది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### రూ.95 వేల నగదు, మొబైల్ ఫోన్లు, పేకాట సామాగ్రి స్వాధీనం



**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 4 :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ముఠాను బాలానగర్ ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని శ్రీ గీతాంజలి టవర్స్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న సమాచారం ఆధారంగా ఎస్ఓటి పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మిక దాడి నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వారి వద్ద నుండి రూ.95 వేల నగదు, 11 మొబైల్ ఫోన్లు, 10 ప్లేయింగ్ కార్డు సెట్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరాన్ని నడిపిన నిర్వాహకులపై మరియు ఆటలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపారు. జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలలో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిక చేశారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటింటా బిజెపి: బిజెపి నాయకులు మెరుగు నర్సింహ రెడ్డి



**మేడ్చల్- ఆగస్టు 5:(నవభూమి ప్రతినిధి)** బిజెపి సంపర్క్ అభియాన్‌లి లో భాగంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధి లో ఈరోజు బూత్ నంబర్ 327 బూత్అధ్యక్షులుమెరుగునరసింహారెడ్డి ఆధ్వర్యంలో హర్ హర్ మోదీ ఘర్ ఘర్ మోదీఇంటి ఇంటికి బిజెపి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇంటి ఇంటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు పాడిగం వీరేశం , బిజెపి నాయకులు గాడిలా శశికాంత్ రెడ్డి , కట్ట మధుసూదన్ , కార్యకర్తలు పాల్గొన్నారు

## అక్రమాలపై నిఘా



**సిరిసిల్ల ఆగస్టు 5:(నవభూమి ప్రతినిధి)** అక్రమ ఇసుక, మట్టి రవాణాపై జిల్లా అధికార యంత్రాంగం నిఘా పెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా దాడులు చేపడుతున్నారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి భారీగా జరిమానా విధిస్తున్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే సంయుక్త ఆధ్వర్యంలో సహజ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాతో పాటు నిరంతరం దాడులు చేయడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం నిబంధనల మేరకు తరలించేందుకు కలెక్టర్ అనుమతి ఇస్తున్నారు. నిర్మాణదారులకు ఇసుక, మట్టి కోసం ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కావాల్సిన ఇసుక, మట్టి సమకూర్చాలని ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చారు.

**జిల్లాలో 691 వాహనాలు సీజ్**

జిల్లాలో అనుమతి లేకుండా మొరం, మట్టి తరలిస్తున్న 691 వాహనాలను మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో సీజ్ చేసి రూ. 1,02,026 జరిమానా విధించారు. అలాగే అధికా రికంగా అనుమతి లేకుండా మొరం, మట్టి తవ్వకాలు చేస్తున్న జిల్లాలోని ఆయా మండలాల్లో నలుగురికి రూ. 2,87,515 జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. జిల్లాలో జూలై 21న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటాచి, 12న ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, 28న ముస్తాబాద్ మండ లం చిప్పలపల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, జూన్ 28న ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వాహ నాలకు బ్యానర్ కట్టి వేములవాడ రూరల్ మండలంలోని కొడిముంజ, అనుపురం పరిసరాల్లో అక్రమ రవాణా చేస్తున్న 10టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, రెండు జేసీబీలు, రెండు హిటాచిలను, ఇదే నెల 22న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటా చీ, జేసీబీ, అలాగే ఒక టిప్పర్ ను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్లకు, ఎస్పీ కార్యాలయానికి తరలించారు.

**అక్రమ రవాణాను ఉపేక్షించం**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జిల్లాలో అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే ఉపేక్షించం. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక, మట్టి తరలించవద్దు. ప్రభుత్వ పనిదినాలలో మాత్రమే అనుమతులు ఇస్తాం.

## వైద్య సేవలు మెరుగయ్యేదెన్నడు?




**కరీంనగర్ ఆగస్టు 5:(నవభూమి ప్రతినిధి)** జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యాయి. టీచింగ్ హాస్పిటల్‌గా ప్రకటించిన జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఆ స్థాయికి తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపించడం లేదు. జిల్లా జనరల్ ఆసుపత్రులను బోధనాసుపత్రుల స్థాయికి తీర్చిదిద్దే విషయంలో అడుగులు వేగంగా పడడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధాన ఆసుపత్రిని రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు టీచింగ్ హాస్పిటల్‌గా ప్రకటించారు. 750 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో 500 నుంచి వెయ్యి మంది వరకు రోగులు ప్రతిరోజు వివిధ పరీక్షలు, చికిత్సల కోసం వస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలన్నింటి నుంచి ఇక్కడికి అత్యవసర పరిస్థితుల్లో రోగులను పంపిస్తుంటారు. అయినా ఈ ఆసుపత్రిలో ఇంకా మెరుగైన సేవలు అందించడానికి ఏర్పాట్లు మాత్రం లేకుండా పోయాయి.

**అందుబాటులోకి రాని క్రిటికల్ కేర్ సేవలు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మార్చిన అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు క్రిటికల్ కేర్ విభాగ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లకు పూర్తయిన క్రిటికల్ కేర్ విభాగాన్ని జూలై 28న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. కేంద్రం 23.75 కోట్ల రూపాయలు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించిందని, ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించి రోగులకు సేవలందించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. క్రిటికల్ కేర్ విభాగానికి నామమాత్రంగా భవనం నిర్మించారుగాని అవసరమైన సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల నియామకాలు చేపట్టలేదు. ఒక మినీ థియేటర్‌ను నిర్మించి కొన్ని బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. మల్టీ పారా మానిటర్స్, అడ్వాన్స్ టేబుల్స్ వచ్చాయి. ఈ విభాగంలో ఉండాల్సిన మూడు పెద్ద ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు ఇంకా ప్రారంభం కాలేదు. న్యూరో సర్జరీకి సంబంధించిన పరికరాలు, న్యూరో సీఆర్మ్ కార్డియాలజీకి సంబంధించిన పరికరాలు, న్యూరాలజీకి సంబంధించిన పరికరాలు సమకూర్చాల్సిన అవసరం ఉన్నది. క్రిటికల్ సేవలు అందించడానికి అవసరమైన సూపర్ స్పెషలిస్టు డాక్టర్లు, ఇతర వైద్యులు, సాంకేతిక సిబ్బందిని నియమించాల్సి ఉన్నది.

**గుండె సమస్యలకు అందని వైద్యం**

క్యాథ్‌ల్యాబ్ లేకపోవడంతో రోగులను ఇక్కడ నుంచి నిమ్స్‌కు గాని, ఎంజీఎంకు గాని, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. క్యాథ్‌ల్యాబ్ ఉంటే గుండెపోటుకు గురైన వారికి యాక్సిడెంట్లు, తదితర సందర్భాలలో కార్డియాక్ సమస్యలు ఉత్పన్నమైన వారు గాని, అత్యవసర చికిత్స పొందే అవకాశం ఉంటుంది. యాంజియోగ్రామ్ నిర్వహించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో స్టంట్ వేసే సౌకర్యం కూడా ఈ క్యాథ్‌ల్యాబ్ వల్లనే సమకూరుతుంది. రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భంలో న్యూరో, ఆర్థో, కార్డియాక్ సంబంధిత సేవలు అవసరమవుతాయి. కార్డియాలజీ, న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ జనరల్ మెడిసిన్, న్యూరో ఫిజిషియన్, పీడియాట్రిక్ విభాగాలకు చెందిన సుమారు 50 మంది ఎండీడీఎం, ఎంఎస్ ఎంసీహెచ్ సూపర్‌స్పెషలిస్టులను, ఇతర వైద్యులను నియమించాల్సి ఉన్నది. వీరు లేని కారణంగా అత్యవసర సమయాల్లో సత్వర వైద్య సేవలకోసం రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తున్నది. ఆయా ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్యాథ్‌ల్యాబ్, ఇతర సౌకర్యాలు పొందడానికి లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు బిల్లులు చెల్లించాల్సి వచ్చి సామాన్యులు అప్పులపాలవుతున్నారు. అటు ప్రజలకు వైద్య సేవలు అందించడం, ఇటు వైద్య విద్యార్థులకు విద్యాభ్యాసం చేసుకునే వీలు కలిగించేందుకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ విభాగాలను క్రిటికల్ కేర్ విభాగాన్ని వెంటనే ప్రారంభించాల్సిన అవసరం ఉన్నది.

**మంత్రులు చొరవ తీసుకుంటేనే..**

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్న మంత్రులు దృష్టి సారించి సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ నిపుణలకు ప్రభుత్వం ఇస్తున్న వేతనం తక్కువగా ఉన్నందన డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగం చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.